భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల సాధారణ అబ్జర్వర్ తుషార్ కాంత మహంతి

సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారి తుషార్ కాంత మహంతి

ఖమ్మం రూరల్, నవంబర్ 19: భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల సాధారణ అబ్జర్వర్ తుషార్ కాంత మహంతి అన్నారు. ఆదివారం మండలంలోని పొన్నెకల్ గ్రామ పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూం, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్ర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద సీసీ టీవీలను పరిశీలన చేశారు. భద్రతా సిబ్బంది స్ట్రాంగ్‌రూం చుట్టూ నిఘా పెట్టాలని ఆదేశించారు. లెక్కింపు కేంద్ర ఏర్పాటు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. టేబుళ్ల ఏర్పాటు, ఏజెంట్ల సిట్టింగ్, ఈవీఎంల కదలికలు, అధికారుల లెక్కింపు విధుల సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్ల ప్రవేశం, నిష్క్రమణ గురించి అడగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అబ్జర్వర్ అన్నారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం రాజేశ్వరి, సహాయ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ పీవీ రామకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం, నవంబర్ 19: రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ.వరాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆదివారం వివిధ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో అనుమతులు లేకుండా పటాకులు పేల్చవద్దని, ఇతర పార్టీలు, అభ్యర్థులకు సంబంధించి అభ్యంతరకరమైన పోస్టులను వాట్సప్ గ్రూపుల్లో పెట్టవద్దని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

వైరాటౌన్, నవంబర్ 19: సీఎం కేసీఆర్‌తోనే నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిరంతరాయంగా కరెంటు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు మదన్‌లాల్ అన్నారు. ఆదివారం ఏన్కూరు మండలంలో గ్రామాల్లో ప్రచారం కొనసాగింది. కేసుపల్లి గ్రామంలో జరిగిన ప్రచారంలో ఎంపీ నామా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బానోతు మదన్‌లాల్ కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక : శ్రీరామగిరి గ్రామంలో పలు పార్టీలకు చెందిన 30 కుటుంబాల వారు బానోతు మదన్‌లాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అలరించిన 'కొత్త తరం కొడుకులు'

కళాకారులను సత్కరిస్తున్న కలెక్టర్, రవి

ఖమ్మం, నవంబర్ 19: 'నెలనెలా వెన్నెల' కళా సాంస్కృతిక కదంబం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన 'కొత్త తరం కొడుకులు' నాటకం అలరించింది. కలెక్టర్ వీపీ గౌతమ్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ నాటకాన్ని తిలకించి నిర్వాహకులను అభినందించారు. తల్లిదండ్రుల బాధ్యతను వదిలించుకోవాలని, వారి ఆస్తికి మాత్రమే వారసులం కావాలని నేటి సమాజంలో అమానవీయంగా జరుగుతున్న ఆలోచనలు కొత్త తరం కొడుకుల పాత్రల్లో కనిపించాయి. ఈ 'నెలనెలా వెన్నెల' 76వ సాంస్కృతిక కదంబం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. నాగబత్తిన రవి సహచరి మాలతిని స్మరిస్తూ రవి ఆధ్వర్యంలో 142 మంది కళాకారులను కలెక్టర్ సన్మానించారు.

నోట్ల కట్టలతో పాలేరు ప్రజలను కొనలేరు

శ్వాస ఉన్నంత వరకు పాలేరుతోనే నా పయనం

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కందాళ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, నవంబర్ 19: ఇతర ప్రాంతాల్లో మాదిరిగా పాలేరు ప్రజలను నోట్లకట్లతో ఎవరు, ఎప్పటికీ కొనలేరని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పార్టీ సమన్వయ కర్తలు తూళ్లూరి జీవన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. మండంలోని నర్సింహాపురం, ఏదులాపురం గ్రామ పరిధిలోని మారుతినగర్, శ్రీరాం నగర్, వరంగల్ క్రాస్‌రోడ్ ఏరియాలలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్‌షోలో వందలాది మంది మహిళలు పాల్గొనడం విశేషం. అనంతరం ఆయా సెంటర్లలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో ఎమ్మెల్యే మాట్లాడారు. గురిగింజ సామెతలాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అబద్దాల మాటాలతో ఓటర్లను ఆయోమయం చేస్తున్నాడన్నారు. కోట్లాది రూపాయలతో దొరికిన వ్యక్తే నోట్లకట్టలు పంచుతున్నాడని అంటుంటే దొంగే దొంగ గొంగ అన్నట్టు ఉంది అని ఎద్దేవా చేశారు. పాలేరు ప్రజలు విశ్వాసం పొందిన బీఆర్ఎస్ పార్టీ అని, వారి నమ్మకం ఎమ్మెల్యే కందాళ మాత్రమే అన్నారు. పాలేరు ప్రజలతో నా కుటుంబానికి ఉన్న అనుబంధం ఎవరూ విడదీయలేరని, నా ప్రాణం, నా చివరి శ్వాస వరకు పాలేరు ప్రజలతోనే ఉంటానన్నారు. మట్టికి పోయిన ఇంటివాడు ఉండాలని.. పెద్దలు ఎప్పటికి చెబుతారని, మనల్ని పాలించే బాధ్యత పరాయివాడికి ఇస్తే ఎలా ఉంటదో ఆలోచన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రతి కాలనీ సీటీ కాలనీగా తయారు చేసుకున్నామని, ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మంచి మెజార్టీ అందించాలని ఎమ్మెల్యే కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు మండల బెల్లం వేణు, జడ్పీటీసీ వరప్రసాద్, ఎంపీపీ బెల్లం ఉమ, సుడా డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంపటి ఉపేందర్, మైబెల్లి సాహెబ్, గరుడ రమేశ్, రమేశ్, రఫీ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటోనడిపిన ఎమ్మెల్యే కందాళ

ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. అదే సమయంలో రహదారి ప్రక్కన ఆటోలో పిల్లలు, పెద్దలు కందాళకు జై అంటూ నినాదాలు చేశారు. దీంతో నేరుగా ఆటో వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే స్వయంగా ఆటో నడపి వారిని ఉత్సాహపరిచారు. ఎన్నికల్లో కారు గర్తుకు ఓటెయ్యాలని అక్కడివారిని ఎమ్మెల్యే అభ్యర్థించారు.

బీఆర్ఎస్‌కు ఎదురు లేదు.. కందాళకు తిరుగు లేదు

వెంపటినగర్ వాసులతో ఎమ్మెల్యే కందాళ

పిండిప్రోలులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నేలకొండపల్లి మండలంలో ప్రచారం చేస్తున్న కందాళ కూతురు దీపిక

పార్టీలో చేరిన మాదిగి జేఏసీ నాయకులు

కందాళ గెలుపు కోసం ఒక్కటవుతున్న ప్రజలు

ఒకేరోజు ఆరు గ్రామాల ప్రజలు బీఆర్ఎస్‌లో చేరిక

ఖమ్మం రూరల్, నవంబర్ 19: బీఆర్ఎస్‌కు ఎదురు లేదు.. పాలేరులో కందాళకు తిరుగు లేదు అని, కందాళ గెలుపు కోసం మేము సైతం అంటూ ఒక్కటవుతున్నారు. ఆదివారం ఒకే రోజు ఆరు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. రోజూ చేరికలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపిస్తున్నది. ఎన్నికల్లో కందాళను మరోసారి గెలిపించుకునే వరకు విశ్రమించేది లేదని ప్రతిన బూనుతున్నారు. ఆదివారం వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున ఆయా పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వరంగల్ క్రాస్ రోడ్, మారుతీనగర్‌కు చెందిన 55 కుటుంబాలు స్థానిక నాయకులు వెంపటి ఉపేందర్, మైబెల్లిసాహెబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందాళ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని సాయి గణేష్‌నగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాదిగ జేఏసీ పాలేరు ఇన్‌చార్జి కిన్నెర ప్రవీణ్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల నాయకులు, కూసుమంచి మండలం బజ్జుల్‌రావుపేటకు చెందిన యువకులు, తిరుమయలపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యూత్ అసోసియేషన్ నాయకులు, నాయుడుపేటకు చెందిన 15 కుటుంబాలు, కామంచికల్ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, సుడా డైరెక్టర్ గూడ సంజీవరెడ్డితో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాళను గెలిపించాలని విజ్ఞప్తి

తిరుమలాయపాలెం, నవంబర్ 19: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని పిండిప్రోలు, కాకరవాయి, బీరోలు, జల్లేపల్లి, బచ్చోడు, దమ్మాయిగూడెం, కొక్కెరేణి, తెట్టెలపాడు, రఘునాథపాలెం, కుక్కలతండాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మరోమారు బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పాలేరు నియోజకవర్గంలో దళితబంధును పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఓటర్లకు తెలిపారు. పేదలందరికీ సన్నబియ్యం అందిస్తారని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాషబోయిన వీరన్న, దేవరం దేవేందర్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, చామకూరి రాజు, పరికపల్లి చంద్రశేఖర్, ఆలిస్యం నాగేశ్వరావు, వంచర్ల సత్యనారాయణరెడ్డి, వీరబోయిన శ్రీనివాస్, జక్కుల యాదగిరి, రామడుగు సురేశ్, శైలజ, సూర్య పాల్గొన్నారు.

కూసుమంచి, నవంబర్ 19: బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కందాళ పెద్ద కుమార్తె దీపిక ఆదివారం నేలకొండపల్లి మండలంలోని ఆచార్లగూడెం, అమ్మగూడెం, కోనాయిగూడెం, కొరట్లగూడెం తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలను పంచుతూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, మండలం అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

కాకరవాయిలో కమ్ముకున్న విషాదం

మృతులిద్దరూ అన్నదమ్ముల పిల్లలు

నల్లగట్టు జశ్వంత్, నల్లగట్టు చరణ్ (ఫైల్)

తిరుమలాయపాలెం, నవంబర్ 19: మండలంలోని దమ్మాయిగూడెం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకరవాయి గ్రామానికి చెందిన నల్లగట్టు జశ్వంత్ (చింటు) (18), నల్లగట్టు చరణ్(15) ఇద్దరూ ఖమ్మం నుంచి బైక్‌పై స్వగ్రాం వస్తున్నారు. బైక్ దమ్మాయిగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే మరిపెడ బంగ్లా నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ అతి వేగంగా వెళ్లి అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో జశ్వంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు నల్లగట్టు చరణ్ (15) తీవ్రంగా గాయ పడడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతులు ఇద్దరూ అన్నదమ్ముల కుమారులు. పేద కుటుంబాల్లో ఇద్దరు కుమారులు మృతిచెందడంతో కాకరవాయిలో విషాదచాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్ఐ.శ్రీనివాసరావు సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.